అధికారుల అండ.. పాతెయ్ జెండా!

మండలంలో అధికారుల అండ ఉంటే చాలు.. ప్రభుత్వ స్థలంలో జెండా పాతేయవచ్చు. ఉన్నతాధికారులు ఉన్నారు కదా..మీ అనుమానం. ఇదంతా తమకు షరా మామూలే.. అంటూ యంత్రాంగం కళ్లప్పగించి చూస్తుండడంతో అక్రమార్కుల ఆగడాలకు అంతే లేకుండా పోతోంది. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు కంచె నాటేస్తున్నారు. అడిగినప్పుడు చూసుకుందాంలే.. అవసరమైతే ఖాళీ చేద్దాంలే అన్న ధోరణిలో అక్రమార్కులు బరితెగిస్తున్నారు. దీంతో రూ.కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములు కర్పూరంలా కరిగిపోతున్నాయి. ఇదీ ఇందిరానగర్‌లో ప్రభుత్వ కార్యాలయాలకు కూతవేటు దూరంలోని సీఎల్ఎస్‌పల్లె రెవెన్యూ పరిధిలో కబ్జా కథ.

- వరదయ్యపాళెంలో రూ.5 కోట్ల ప్రభుత్వ భూమి ఆక్రమణ
- తహసీల్దార్ కార్యాలయానికి కూతవేటు దూరంలో కబ్జా తంతు
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు


వరదయ్యపాళెం తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఆక్రమణకు గురైన భూమిలో జరుగుతున్న కట్టడాలు

వరదయ్యపాళెం: సామాన్య ప్రజలు గూడు కోసం చిన్నపాక వేసుకుంటే రెవెన్యూ అధికారులు పలు ఆంక్షలు విధిస్తారు. అయితే ఏకంగా రూ.5 కోట్లకు పైగా విలువ చేసే ప్రభుత్వ భూమి తమ కళ్లెదుటే దర్జాగా ఆక్రమించుకుని, ఆ భూమిలో నిర్మాణాలు చేపడుతున్నా తమకేమీ పట్టనట్లు కళ్లకు గంతలు కట్టుకుని కూర్చున్నారు. ఇందుకు కబ్జాదారుడి నుంచి భారీగా ముడుపులు అందుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇదంతా వరదయ్యపాళెం తహసీల్దార్ కార్యాలయానికి కూతవేటు దూరంలో జరుగుతున్న ఆక్రమణ తంతు. మండల కేంద్రంలోని ఇందిరానగర్‌లో ప్రభుత్వ కార్యాలయాలకు సమీపంలో ఉన్న సీఎల్ఎస్‌పల్లె రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 307లో 1, 2లో ఉన్న 2.73 సెంట్ల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిపై చెన్నైలో స్థిరపడిన వరదయ్యపాళెం మండలం, సీఎల్ఎస్‌పల్లెకు చెందిన కళ్యాణ మండపం అధినేత కన్ను పడింది. ఆయనకు ఈ భూమికి ఆనుకుని పట్టా భూమి ఉంది. ఆయన ఇటీవల కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యమైన కాషాయ పార్టీలో చేరి, జిల్లా పార్టీ పదవి పొందాడు. ఇదే అదునుగా భావించిన ఆయన తన పట్టా భూమికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిని విడతల వారీగా ఆక్రమించేందుకు సిద్ధమయ్యాడు. ఆ దిశగా రాత్రికి రాత్రే ఆ భూమిలో తాగునీటి కోసం బోరు వేసి, కొద్ది రోజుల వ్యవధిలో ఓ భవనం నిర్మించేందుకు పునాది పనులను చకచక చేస్తున్నాడు.

సీసీఎల్‌లోనూ ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు

2015లో ఈ భూమిని ప్రభుత్వ భూమిగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అయితే ఆక్రమణలకు పాల్పడిన సంపన్న వర్గానికి చెందిన వ్యాపారవేత్త ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సీసీఎల్ కోర్టును ఆశ్రయించాడు. అప్పటి నుంచి విచారణలో ఈ భూమి ఉంది. తాజాగా రెండు నెలల క్రితం సంబంధిత డీకేటీ భూమి ప్రభుత్వానిదేనంటూ సీసీఎల్ కోర్టు తీర్పునిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే అధికారులు మాత్రం ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వచ్చినప్పటికీ ఆ భూమిని స్వాధీనం చేసుకోవడంలో వెనుకడుగు వేస్తున్నారు. ఆక్రమిత భూమికి ఆనుకుని వ్యాపారవేత్తకు చెందిన కల్యాణ మండపం ఉండడం, దానికి సమీపంలో తాజాగా పిల్లర్లు వేసి నిర్మాణాలు మొదలు పెడుతున్నా.. ప్రారంభంలో మొక్కుబడిగా అడ్డుతగిలిన రెవెన్యూ అధికారులు తాజాగా రెండు రోజుల క్రితం మళ్లీ పునాది పనులను మొదలు పెట్టినా నిమ్మకు నీరెత్తిన చందంగా వ్యవహరిస్తున్నారు. రెవెన్యూలో కీలక అధికారులు వ్యాపారవేత్త చేతుల్లో కీలుబొమ్మలుగా మారడం, ఆయన నుంచి పెద్దఎత్తున ముడుపులు అందుకోవడంతోనే అక్రమ నిర్మాణాలకు అభయమని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఈ విషయమై సూళ్లూరుపేట ఆర్డీఓ చంద్రమునిని వివరణ కోరగా.. సీఎల్ఎస్‌పల్లె రెవెన్యూ సర్వే నంబర్ 307లోని 1, 2లో ఉన్న 2.73 సెంట్లు డీకేటీ భూమి ప్రభుత్వానికి చెందినదేనని తెలిపారు. ఆక్రమిత భూమిని గురించి ఆయనను వివరణ కోరగా ఇప్పటికే ఆ భూమిలో కట్టడాలను గతంలో అడ్డుకున్నామని, తాజాగా పనులు చేపడుతున్న విషయం గురించి మండల రెవెన్యూ అధికారి నుంచి వివరాలు తీసుకుని ప్రభుత్వ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

క్లుప్తంగా

ముక్కంటి సేవలో సుడిగాలి సుధీర్


ఆలయంలో సుధీర్

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని గురువారం జబర్దస్త్ ఫేమ్, హీరో సుడిగాలి సుదీర్ దర్శించుకున్నారు. ఆలయాధికారులు ఆయనకు స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి, స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయాధికారులు, వైఎస్సార్ సీపీ నాయకుడు లోకేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

భూమిపూజ

ఏర్పేడు: మండలంలోని విశ్వతమాల రెవెన్యూలో గురుకుల్ ఇంటర్నేషనల్ స్కూల్ భవనాల నిర్మాణ పనులకు గురువారం ఎమ్మెల్యే వెంకట సుధీర్‌రెడ్డి భూమి పూజ చేశారు. విశ్వతమాల రెవెన్యూలో సుమారు 14 ఎకరాల్లో నూతనంగా పాఠశాలను ఏర్పాటు చేయనున్నారు. కార్యక్రమంలో దేవకృష్ణదాస్‌జీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల సంబరాలు


స్వీట్లు పంచుకుంటున్న ఎమ్మార్పీఎస్ నేతలు

శ్రీకాళహస్తి: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు ఇవ్వడంతో పట్టణంలోని ఎమ్మార్పీఎస్ నాయకులు గురువారం సంబరాలు చేసుకున్నారు. ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇర్లరాజా ఆధ్వర్యంలో నాలుగు మాడ వీధుల్లో బారీ ర్యాలీ నిర్వహించి, అనంతరం బస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ ఎమార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ 30 ఏళ్ల పోరాటంతో ఎస్సీ వర్గీకరణ జరిగిందన్నారు. ఇది మాదిగలకు ఎంతో ఉపకరిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీస్ నాయకులు పాల్గొన్నారు.

ముగ్గురిపై వరకట్న వేధింపుల కేసు

ఏర్పేడు: అదనపు కట్నం వేధింపులపై మండలంలోని మునలిపేడు ఎస్సీ కాలనీకి చెందిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీరామశ్రీనివాసులు గురువారం తెలిపారు. సీఐ కథనం మేరకు.. మునలిపేడు ఎస్సీ కాలనీకి చెందిన ప్రసన్నకు అదే కాలనీకి చెందిన తారకరామన్‌కు రెండేళ్ల క్రితం వివాహమైంది. వివాహ సమయంలో ఆరన్నర సవర్ల బంగారు నగలు, రూ.లక్ష నగదు వరకట్నంగా అందజేశారు. ఈ క్రమంలో ప్రస్తుతం అదనపు కట్నం తీసుకురావాలని ప్రసన్నను ఆమె భర్త, కుటుంబ సభ్యులు చిట్టెమ్మ, సుబ్రమణ్యం వేధిస్తున్నారని, ఆమె ఫిర్యాదు చేయడంతో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

ఒకరిపై కేసు నమోదు

ఏర్పేడు: ఓ మహిళను దుర్భాషలాడి, సెల్‌ఫోన్ పగులగొట్టిన ఘటనలో మండలంలోని సీతారాంపేట ఎస్సీ కాలనీకి చెందిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు గురువారం ఏర్పేడు సీఐ శ్రీరామశ్రీనివాసులు తెలిపారు. సీఐ కథనం మేరకు.. కోబాక ఎస్సీ కాలనీకి చెందిన రేఖను సీతారాంపేట ఎస్సీ కాలనీకి చెందిన లక్ష్మీనారాయణ గురువారం అసభ్య పదజాలంతో దుర్భాషలాడి, సెల్‌ఫోన్ పగులగొట్టారు. ఈ విషయమై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

పింఛన్ల పంపిణీ తనిఖీ


ఏర్పేడు: ఆమందూరులో పింఛన్ పంపిణీ చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

ఏర్పేడు: మండలంలోని ఆమందూరు పంచాయతీలో గురువారం జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమందూరులో ఆయనే స్వయంగా పింఛన్ నగదు అందజేశారు.

పింఛన్ల పంపిణీని తనిఖీ చేసిన జేసీ

రేణిగుంట: కరకంబాడి పంచాయతీలో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని జేసీ శుభం బన్సల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.

రేణిగుంట మండలంలో..

శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో గురువారం సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు.

ఎమ్మెల్యేచే పింఛన్ల పంపిణీ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కారణిమిట్టలో గురువారం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పింఛన్‌దారులకు పింఛన్ల పంపిణీ చేశారు

నారాయణవనం: సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గురువారం నారాయణవనంలో ఆయన పింఛన్లు అందజేశారు.

బాధ్యతగా పనిచేయాలి

వరదయ్యపాళెం: కుష్టు వ్యాధిని గుర్తింపులో గ్రామస్థాయి వైద్య సిబ్బంది బాధ్యతతో పని చేయాలని జిల్లా కుష్టు వ్యాధి నివారణ అధికారి డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి అన్నారు. మండల పర్యటనకు వచ్చిన ఆయన చిన్న పాండూరు పీహెచ్‌సీ పరిధిలో జరుగుతున్న జాతీయ కుష్టు నివారణ ఇంటింటా సర్వే కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. రామిరెడ్డి పాళెం గ్రామంలో పాల్గొని అక్కడ గుర్తించిన కుష్టు వ్యాధిగ్రస్తులకు ఉన్న వ్యాధి లక్షణాలను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యులు రమణ, లావణ్య, ఉదయ్‌కుమార్, కిరణ్ కుమార్, ద్వైత, కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

వైభవంగా పార్వేట ఉత్సవం



శ్రీకాళహస్తి: విజ్ఞానగిరిపై ఉన్న శ్రీవల్లి దేవసేన సమేత కుమారస్వామి ఆడికృత్తిక ఉత్సవాల్లో భాగంగా గురువారం పార్వేట ఉత్సవం వైభవంగా నిర్వహించారు. అలంకార మండపంలో స్వామి అమ్మవార్లకు విశేష పూజలు చేశారు. అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను చప్పరాలపై కొలువుదీర్చి ఊరేగించారు.

వైఎస్సార్ సీపీ అధినేతకు ఆహ్వానం


మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి పెండ్లిపత్రికను అందజేస్తున్న బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, భారతి దంపతులను గురువారం శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి దంపతులు తమ కుమార్తె వివాహానికి రావాలని ఆహ్వానించారు. ఈ మేరకు ఆహ్వాన పత్రికను అందజేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దంపతులను వారు కలిసి తమ కుమార్తె పవిత్రారెడ్డికి డాక్టర్ కౌశిక్‌రెడ్డితో వివాహం జరుగుతుందని తప్పకుండా హాజరై, ఆశీర్వదించాలని కోరారు.

లీగల్ పేపర్ బండిల్ తెస్తేనే పోలీసు క్లియరెన్స్ సర్టిఫికెట్

నాగలాపురం: ప్రైవేటు సంస్థలో ఉద్యోగాలు దరఖాస్తు కోసం నాగలాపురం పోలీసు స్టేషన్‌లో క్లియరెన్స్ సర్టిఫికెట్ల కోసం వస్తున్న అర్జీదారులను స్టేషన్‌లో పనిచేసే కొందరు సిబ్బంది ఎ4, లీగల్ పేపర్ బండిల్ తెస్తేనే సర్టిఫికెట్ ఇస్తామని చెబుతున్నారు. దీంతో అర్జీదారులు ఆశ్చర్యానికి గురై ఒక్క కాగితం కోసం బండిల్ తీసుకునిరావాలని చెప్పడం ఏమిటని? ఆగ్రహం వ్యక్తం చేశారు. లీగల్ పేపర్ బండిల్ తీసుకురావాలంటే రూ.380 ఖర్చు అవుతోంది. రూ.10 వేలు, రూ.15 వేలు జీతానికి వెళ్లే తమ లాంటి మధ్య తరగతి వారి వద్ద ఇలా తీసుకోవడం ధర్మం కాదని చెప్పడంతో, కొందరిపై ఆ సిబ్బంది బెదిరింపు దిగినట్లు సమాచారం. ఒక వేల లేదని చెప్తే పోలీసు క్లియరెన్స్ సర్టిఫికెట్ ఇస్తారో? ఇవ్వరో? అన్న భయంతో కొందరు ఖర్చు పెట్టి మరీ సర్టిఫికెట్లు పొందుతున్నారు. ఈ ఘటనలు పునావృతం కాకుండా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని అర్జీదారులు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఎస్ఐ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు.

ప్రతి విద్యార్థీ ఉన్నత స్థానానికి చేరుకోవాలి


పుస్తకాలు అందజేస్తున్న వెంకటసుబ్బమ్మ

ఏర్పేడు: ప్రతి విద్యార్థీ కష్టపడి చదివి, ఉన్నత స్థానానికి చేరుకోవా లని ఇన్‌చార్జి ప్రిన్సిపల్ వెంకటసుబ్బమ్మ అన్నారు. గురువారం మండలంలోని పాపానాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఉచిత నోటు పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీమన్నారాయణ, ఉమ, రాఘవరెడ్డి, వెంకటసురేష్, రామాంజులు, శంకరప్ప, సువర్ణ, అమరేశ్వర్‌రెడ్డి, షమీర్, సాయితేజ పాల్గొన్నారు.


సత్యవేడు: పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ

ఇంటర్ కళాశాలలకు పుస్తకాల పంపిణీ

సత్యవేడు: ప్రభుత్వ జూనియర్ బాలుర, బాలికల కళాశాలలో చదువుతున్న 173 మంది విద్యార్థులు పాఠ్య, నోటు పుస్తకాలు పంపిణీ చేసినట్లు ఎంఈఓ రవి తెలిపారు. గురువారం బాలుర జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ బి.అనికుమార్‌కు ఇంటర్ పాఠ్యపుస్తకాలను ఎంఈఓ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 ఉషా, అధ్యాపకులు శివరామ్, దస్తగిరి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

తిరుచ్చిపై ఆండాల్ అమ్మవారు


తిరుచ్చి వాహనంపై ఆండాళ్ అమ్మవారు

నారాయణవనం: స్థానిక పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై ఆండాల్ అమ్మవారు మాడవీధుల్లో విహరించారు. ఉదయం సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచి అర్చకులు నిత్యపూజా కార్యక్రమాలు నిర్వహించారు. తిరువాడిపుర ఉత్సవాల సందర్భంగా ఆండాళ్(గోదాదేవి)కి అభిషేకం, అర్చనలు చేశారు. సాయంత్రం అమ్మవారు తిరుచ్చి వాహనంలో కొలువుదీరి మాడవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఆలయానికి చేరుకున్న అమ్మవారికి ఆస్థానం నిర్వహించి, దూప, దీప నైవేద్యాలను సమర్పించారు. ఈ కార్యక్రమాలను స్థానిక ఆలయాల సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయాధికారి నాగరాజు, ప్రధాన అర్చకులు శ్రీధర భట్టాచార్యులు తదితరులు పర్యవేక్షించారు.

కలెక్టర్‌కు ముక్కంటి ప్రసాదాలు

శ్రీకాళహస్తి: తిరుపతి జిల్లా కలెక్టర్‌ను బీజేపీ జిల్లా అధ్యక్షుడు చంద్రప్ప గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన్ని ముక్కంటి శేషవస్త్రంతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు ప్రశంసనీయం


కమిషనర్ రమేష్‌బాబుతో స్కౌట్స్ అండ్ గైడ్స్

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తిలో స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు ప్రశంసనీయమని పురపాలకసంఘ కమిషనర్ రమేష్‌బాబు అన్నారు. గురువారం వరల్డ్ స్కౌట్‌డే సందర్భంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ పురపాలకసంఘం కార్యాలయంలో ఆయన్ని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ శ్రీకాళహస్తిలో స్కౌట్స్ అండ్ గైడ్స్ చురుగ్గా సేవలు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యాలయ కమిషనర్ రమేష్‌బాబు, హెచ్ఎం రాజేశ్వరి, సహాయ కమిషనర్ రాజేశ్వరి, యూత్ చైర్మన్ అజారుద్దీన్ పాల్గొన్నారు.

నాలుగు టన్నుల ఇసుక సీజ్


సెబ్ అధికారులు సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్

నారాయణవనం: పుత్తూరు సెబ్ సర్కిల్ పరిధిలో గురువారం వేర్వేరు కేసుల్లో 4 టన్నుల ఇసుకను సీజ్ చేసి, రూ.20 వేల అపరాధ రుసుం వసూలు చేసి, ఒక మహిళను అరెస్టు చేసినట్లు పుత్తూరు సెబ్ ఇన్‌స్పెక్టర్ ఊరుకుందమ్మ తెలిపారు. ఆమె మీడియాతో మాట్లాడుతూ గురువారం వేకువజామున పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో పుత్తూరు, చంద్రగిరి సెబ్ అధికారులు, సిబ్బంది మండలంలోని చిత్తూరు కండ్రిగ వద్ద జాతీయ హైవేపై అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేశామన్నారు. బిల్లులు లేకుండా తరలిస్తున్న నాలుగు టన్నుల ఇసుకను సీజ్ చేసి, ట్రాక్టర్ యజమాని నుంచి రూ.10 వేలు అపరాధ రుసుం వసూలు చేశామన్నారు. అలాగే పుత్తూరు సెబ్ సర్కిల్ పరిధిలోని రామచంద్రాపురం బస్టాండ్ సమీపంలో మహిళను అరెస్టు చేసి, 10 మద్యం సీసాలను సీజ్ చేసి, కేసు నమోదు చేశామని చెప్పారు. సారా కేసులో ముద్దాయి నుంచి బ్రీచ్ ఆఫ్ అమౌంట్ కింద రూ.10 వేలను చలానా రూపంలో కట్టించామన్నారు. దాడుల్లో ఎస్ఐ రమణ రాజు, సెబ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చేతివృత్తులతో నిరుద్యోగ నిర్మూలన


సమావేశంలో మాట్లాడుతున్న బాలాజీరెడ్డి

ఏర్పేడు: నిరుద్యోగ నిర్మూలనకు చేతివృత్తులు ఎంతో తోడ్పాటునిస్తాయని రాస్ మహిళా భారతి ప్రాజెక్ట్ అధికారి బాలాజీరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కందాడు, సదాశివపురంలో 75 మంది మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ టైలరింగ్‌తో తక్కువ పెట్టుబడితో కుటుంబ ఆదాయాన్ని పెంచుకోవచ్చన్నారు. శిక్షణ వంద రోజులపాటు జరుగుతుందన్నారు. శిక్షణానంతరం వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో జనశిక్షణ సంస్థాన్ ప్రోగ్రాం అధికారి హరిబాబు, రాస్ సిబ్బంది వెంకట్‌కుమార్, మునిపార్థసారథి, కృష్ణవేణి, సుమలత తదితరులు పాల్గొన్నారు.

నీటిగుంతలతో భూగర్భజలాల పెంపు


పనులు పరిశీలిస్తున్న సరిత

ఏర్పేడు: ఉపాధి హామీ పథకంలో రైతుల వ్యవసాయ పొలాల్లో నీటిగుంతలు ఏర్పాటు చేస్తే భూగర్భజలాలు పెంపొందుతాయని అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సరిత అన్నారు. గురువారం మండలంలోని అంజిమేడులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కూలీల మస్టర్లను తనిఖీ చేశారు. కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ పీడీ మాట్లాడుతూ నీటిగుంతలతో వ్యవసాయ బోర్లు, బావుల్లో భూగర్భ జలాలు పెరిగి పంట సాగుకు నీరందుతుందన్నారు. ప్రస్తుతం గ్రామాల్లో రైతుల వ్యవసాయ పనులు లేనందున కూలీలకు విరివిగా పనులు కల్పించాలని సూచించారు. ప్రతి రోజూ కూలీలకు రూ.300 వేతనం వచ్చేలా పనుల్లో కొలతలపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో సాంకేతిక సహాయకుడు మనోహర్, క్షేత్ర సహాయకురాలు గీతాంజలి, కూలీలు పాల్గొన్నారు.

కోతుల బెడద


దుకాణంలో పండ్లు తింటున్న వానరం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని బుచ్చినాయుడుకండ్రిగలో కోతులు బెడదతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బయ ట ప్రాంతాల వారు కోతులను తీసుకొచ్చి గ్రామంలో వదలివేయడంతో ఎక్కడ చూసిన కోతులు దర్శమిస్తున్నారు. ఇళ్లలో మనుషులు ఉన్నప్పటికీ ఇళ్ల లోపలికి వెళ్లి వస్తువులను ధ్వంసం చేస్తున్నాయి. మెయిన్ రోడ్డులోని దుకాణా ల్లో చొరబడి, వాటికి కావాల్సిన వస్తువులను తెచ్చుకుని తినేస్తున్నాయి. తరిమితే తిరగబడి కరవడానికి మనుషులపైకి వస్తున్నాయి. దీంతో జనం భయపడి పోతున్నారు. కోతులతో ఇబ్బంది పడుతున్నామని పలుమార్లు పంచా యతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని గ్రామస్తులు వాపోతున్నారు. కోతుల ను పట్టి అడవుల్లో వదలి, వాటి బెడద నుంచి కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మాకు రక్షణ కల్పించండి సారూ..!

శ్రీకాళహస్తి: ‘మా ఊరిలో మమల్ని తరిమి కొడుతున్నారు. మా ఊళ్లో మాకు రక్షణ లేకుండా పోయింది.. రక్షణ కల్పించండి సారూ.’ అని కొత్తకండ్రిగ గ్రామం నుంచి బయటకువెళ్లి తలదాచుకుంటున్న 15 కుటుంబాలు వారు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం వారు తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. అధికారులు పింఛన్ పంపిణీ కార్యక్రమం ఉండడంతో బాధితులందరూ సుమారు 45 మంది ఈ మేరకు తహసీల్దార్‌కు విన్నవించుకున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత తామంతా ఎక్కడో తలదాచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. జూన్ 4వ తేదీ రాత్రి నుంచే వేధింపులు ప్రారంభించారన్నారు. అదే నెల 19వ తేదీ మొదటి సారి ఎర్రయ్యపై దాడి చేయడంతో ప్రభుత్వాస్పత్రిలో చేరి ఐదుగురిపై కేసు పెడితే చిన్న గొడవ అని చిత్రీకరించి సాధారణ కేసు పెట్టి పరారీలో ఉన్నారని వదిలేశారన్నారు. దాంతో గత నెల 28వ తేదీ 20 మంది టీడీపీ నాయకులు గున్నయ్య ఆధ్వర్యంలో కనిపించినవారిని కొడుతూ ఇళ్లపై దాడులు చేసి భయభ్రాంతులకు గురి చేశాని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో అందరూ ఇళ్లు వదలి బంధువులు, స్నేహితుల ఇళ్లకు వెళ్లి తలదాచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. తమపై దాడి చేసి, తామే వారిపై దాడి చేశామని కేసు పెట్టి ముగ్గురిని సబ్‌జైల్‌కు పంపారని చెప్పారు. తమ ప్రత్యర్థులపై కేసు పెట్టినా తీసుకోకుండా ఇబ్బందులకు గురి చేశారన్నారు. మాకు రక్షణ కల్పించి ఊళ్లో ఉండేలా చేయాలని వేడుకున్నారు. కలెక్టర్‌ను కూడా కలిసి దీనిపై వినతి పత్రం ఇస్తామన్నారు.

తల్లిపాల సంస్కృతిని కాపాడుకుందాం

శ్రీకాళహస్తి రూరల్: తల్లిపాల సంస్కృతిని కాపాడుకుందామని శ్రీకాళహస్తి సీడీపీఓ శాంతి దుర్గ తెలిపారు. ప్రపంచ తల్లిపాల దినోత్సవం సందర్భంగా శ్రీకాళహస్తి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ వారి ఆధ్వర్యంలో మండలంలోని చిన్న సింగమల గ్రామంలో గురువారం ప్రపంచ తల్లిపాల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సీడీపీఓ శాంతి దుర్గ, సర్పంచ్ మాధవి లత చేతుల మీదుగా గర్భిణులకు సీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ పుట్టిన వెంటనే గంట లోపు బిడ్డకు తల్లిపాలు పట్టాలని, ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలే ఇవ్వాలన్నారు. ఉపాధ్యాయురాలు మాధవి, సూపర్‌వైజర్ ఉష, ఏఎన్ఎం బుజ్జమ్మ, ఆశా వర్కర్ నాగేంద్ర, ఎంఎస్‌కే మహాలక్ష్మి పాల్గొన్నారు.

తల్లిపాలలో ఔషధ గుణాలు

బుచ్చినాయుడుకండ్రిగ: తల్లిపాలలో ఔషధగుణాలు మెండుగా ఉన్నాయని వైద్యాధికారి దివాకర్ అన్నారు. గురువారం మండలంలోని గాజులపెళ్లూరు ఎస్టీ కాలనీలో వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు తల్లి పాల ఔషధ గుణాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పుట్టిన శిశువుకు గంటలోపే తల్లిపాలు తాగిస్తే రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అనంతరం ముర్రుపాలపై బాలింతలు, గర్భిణులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీహెచ్‌ఓ వెంకటేష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిల్ప, అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శిశువుకు తల్లిపాలే అమృతం

సత్యవేడు: తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటివని సీడీపీఓ దేవకుమారి అన్నారు. గురువారం మదనంబేడు అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో తల్లిపాల వారోత్సవాల అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, తల్లులకు తల్లిపాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ నవజాత శిశువు ఆరోగ్యంగా పెరగడానికి తల్లిపాలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. ఏఎన్ఎం శ్రీదేవి, సూపర్ వైజర్ చెంచులక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు విజయ, ఉషా, ఆశా వర్కర్లు అమరావతి, నీరజ పాల్గొన్నారు.

అమ్మపాలు అమృతంతో సమానం

వరదయ్యపాళెం: అమ్మపాలు అమృతంతో సమానమని జిల్లా కుష్టు, ఎయిడ్స్, టీబీ నివారణాధికారి డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. వరదయ్యపాళెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన తల్లిపాల వారోత్సవాల అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపు తల్లిపాలు పట్టించాలని, తల్లిపాలు ఇవ్వడంతో తల్లికి, బిడ్డకు మంచి అనుబంధం ఏర్పడుతుందని, బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు.




శ్రీకాళహస్తి రూరల్: గర్భిణులకు సీమంతం చేస్తున్న సర్పంచ్, సీడీపీఓ, సత్యవేడు: మదనంబేడులో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది, వరదయ్యపాళెం: మాట్లాడుతున్న జిల్లా లెప్రసీ నివారణాధికారి శ్రీనివాసులు రెడ్డి